ప్రయాణం.. ప్రాణసంకటం

- పటాన్‌చెరు నియోజకవర్గంలో గుంతలమయంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కొల్లూరు వెళ్లే మార్గంలో ఎగిసిపడుతున్న దుమ్ము


మున్సిపల్ కార్యాలయం ఎదుట

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ కోతలకు గురవడంతో పాటు గుంతలు ఏర్పడి వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఎక్కడో ఒకచోట ప్రమాదాలకు గురవుతుండటంతో ప్రజలు ఈ రోడ్లపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. వాహనాలు మోరాయించడంతో వాహనదారులు వాటికి మరమ్మతులు చేయిస్తూ జేబు గుల్ల చేసుకుంటున్నారు. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ఈ రోడ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కోట్లాది రూపాయలతో రోడ్ల అభివృద్ధి

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో కోట్లాది రూపాయలతో రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రాంతాల్లో రేడియల్ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నెలలు గడుస్తున్నా అధికారులు కనీసం మరమ్మతులు చేసిన పాపానపోవడం లేదు. వర్షాలు పడితే సమస్య మరింత జఠిలంగా మారుతుంది. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

అనేక కాలనీల్లో రోడ్లు ధ్వంసం

నియోజకవర్గంలోని తెల్లాపూర్, ఇస్నాపూర్, అమీన్‌పూర్, బొల్లారం, గుమ్మడిదల, జిన్నారం, గడ్డపోతారం మున్సిపల్ పరిధిల్లో రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిన్నారం పరిధిలోని శివనగర్ నుంచి కంజర్ల చౌరస్తా వరకు రోడ్డు, మాదారం నుంచి రింగ్‌రోడ్డు వరకు, గుమ్మడిదల పట్టణ కేంద్రం నుంచి కానుకుంటా వరకు రోడ్డు పూర్తిగా అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో అనేక కాలనీలు, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఇబ్బందులు పడుతున్నాం..

శివానగర్ నుంచి నిత్యం పాలవ్యాపారులు, విద్యార్థులు, ప్రజలు పటాన్‌చెరుకు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం దశల్లోనే నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో అనేక ప్రమాదాల జరుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలి.

-కృష్ణ, శివానగర్

మరమ్మతులు చేపట్టాలి

గుంతల రోడ్లపై ప్రయాణం కారణంగా వెన్నముక, నడుం, మెడ నొప్పులతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో జేబులకు చిల్లు పడుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

-రాజిరెడ్డి, తెల్లాపూర్

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని హనుమాన్ మందిరం మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోచ్చరణలతో అర్చకులు మాన్య సూక్తముచే ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం స్వస్తి వచనం, నవగ్రహ మండలం, దేవత ఆహ్వానం, సర్వతోభద్ర మండలం, ముఖ్యదేవత స్థాపనం, మహాగణపతి, రుద్రమన్యు హోమం నిర్వహించి హారతి పట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


హోమం నిర్వహిస్తున్న పురోహితులు

నూతన కమిటీ ఎన్నిక


రేవన సిద్ధప్ప


పటోళ్ల శివకుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వీరశైవ లింగాయత్ సమాజ్ సంగారెడ్డి నియోజకవర్గ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా అసిలి రేవనసిద్ధప్ప, ప్రధాన కార్యదర్శిగా పటోళ్ల శివకుమార్‌లను జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... వీరశైవ లింగాయత్ సమాజ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరశైవ లింగాయత్ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొంక రాజేశ్వర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో బాలల పథ్ సంచాలన్

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో నగరశాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కిష్టారెడ్డిపేటలో చిన్నారులతో బాలల పథ్ సంచాలన్ నిర్వహించారు. అంతకు ముందు కాషాయం జెండాతో ధ్వజారోహణ చేసి పథ సంచలన్‌ను ప్రారంభించారు. కిలోమీటర్ మేర పురవీధుల మీదగా కిడ్స్‌రూట్ మార్చ్ చేశారు. పిల్లల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి సంఘ మూల్యాలను బలపరచడం మన బాధ్యత అని సంఘ్ సభ్యులు అన్నారు.


శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులు

బసవదళ్ నాయకులకు సన్మానం

జహీరాబాద్ టౌన్: కర్నాటక రాష్ట్రంలోని బసవకల్యాణ్‌లో జరుగుతున్న 24వ కల్యాణ పర్వ సమ్మేళనానికి జహీరాబాద్ బసవదళ్ నాయకులు వెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ పాటిల్ ఆధ్వర్యంలో జహీరాబాద్, నారాయణఖేడ్ అధ్యక్షులు డాక్టర్ శరణప్ప, నగేశ్, యశ్వంత్‌రావు బసవ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలివెళ్లారు. వారిని మహిళా జగద్గురు గంగామాతాజీ ఆశీర్వదించి సన్మానించారు. ఈ సందర్భంగా జహీరాబాద్, నారాయణఖేడ్ బసవదళ్ నాయకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



ఘనంగా అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఝరాసంగం(జహీరాబాద్): అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఝరాసంగంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల-కోహీర్‌లో ఉపాధ్యాయులు విద్యార్థినులతో కలిసి వేడుకలు జరుపుకొన్నారు. విద్యార్థినులు నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిసిల్ల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటకుండా వదిలేశారు..


సంగారెడ్డి: చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామగ్రామాన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. వాహనాల కాలుష్యాన్ని తగ్గించాలని రహదారుల వెంట సైతం మొక్కలు నాటుతున్నారు. కానీ ఫసల్వాది శివారులోని జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద వందల సంఖ్యలో మొక్కలు వదిలేశారు. ఎటువంటి రక్షణ లేకుండా వదిలేయడంతో కొన్నిమొక్కలను పశువులు తిన్నాయి. మరికొన్ని ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు.



పోలియో చుక్కలు తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): పిల్లలకు తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కల్హేర్ పీహెచ్‌సీ డాక్టర్ జెబా శాహేమిన్ శనివారం పేర్కొన్నారు. ఆదివారం చుక్కల మందు వేసేందుకు మండలంలో 20 బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. 0 నుంచి 5 ఏళ్లలోపు 2,468 మందిని గుర్తించినట్లు చెప్పారు.

సింగూరుకు ఇన్‌ఫ్లో



పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 11644 క్యూసెక్కులు చేరుతుండటంతో ఒక గేట్‌ను ఎత్తి దిగువకు 12778 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం డ్యాంలో 17 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అప్రమత్తంగా ఉండాలి

సీఐ వినాయక రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు సీఐ వినాయకరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాశకు పోతే పెద్ద ఎత్తున నగదు పోగొట్టుకోవాల్సి వస్తుందన్నారు. అపరిచితులు పంపిన లింక్‌లు ఓపెన్ చేయొద్దని, అలాగే అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపినా నమ్మొద్దని తెలిపారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి తెలియజేస్తే పోయిన డబ్బును బ్లాక్ చేసే అవకాశం ఉందని చెప్పారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని సమక్క సారక్క టెంపుల్ చైర్మన్ నీలం భిక్షపతి దంపతులు శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏడాది పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేయడం జరిగింది.

అక్రమ కట్టడాలు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ భూమిలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తుండడంతో విలువైన భూమి అన్యాక్రాంతం అవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, మండల పరిధిలోని గోమారం నడిబొడ్డున ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 539తో పాటు పిత్తర్‌కుంటకు సంబంధించిన శిఖం భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నెల రోజుల క్రితం ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ, శిఖం భూమికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొంతమంది అక్రమార్కులు హద్దులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ భూమిలో కట్టడాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

మరమ్మతులు లేక తాగునీటి సమస్య



నిరుపయోగంగా ప్లాంట్

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని లక్ష్మీపతిగూడెంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మైలాన్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ కొద్ది రోజులుగా పని చేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. వార్డు ఆఫీసర్లకు సమాచారం అందించిన మరమ్మతులు చేపట్టడంలేదని వాపోయారు. మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టి ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఓట్ చోరీపై సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఓట్ చోరీపై కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ ఎంపీపీ రమేశ్ చౌహాన్, కౌన్సిలర్ మజీద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్ అలీ, నాయకులు యూసుఫ్ తదితరులు బీజేపీ ఓట్ చోరీతో వివిధ రాష్ట్రాల్లో మోసగిస్తూ అధికారులోకి వస్తోందని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ప్రజలకు వివరించి సంతకాలు సేకరించారు.

బీజేపీ శ్రేణుల నిరసన


నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ శనివారం మండల కేంద్రం న్యాల్‌కల్‌లో బీజేపీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్, మాజీ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హద్నూర్ ఎస్‌ఐ దోమ సుజిత్ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్, రాహుల్, భీం యాదవ్, నవీన్, పాండు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం


చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనారోగ్యంతో బాధపడుతున్న రామచంద్రాపురం పట్టణానికి చెందిన సురేశ్, నక్షత్రలకు వైద్యం కోసం ముత్తూట్ సంస్థ శనివారం చెక్కులు పంపిణీ చేసింది. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ సింధురెడ్డి, ఆదర్శ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సురేశ్, నక్షత్ర గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న సురక్ష సేవా సంఘం అధ్యక్షుడు గోపిశంకర్ యాదవ్ ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. అందులో భాగంగా సురేశ్‌కు రూ.10వేలు, నక్షత్రకు రూ. 20వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ముత్తూట్ సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరంలా మారిందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తను జనగామ జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు స్రవంతి సమస్యను తన దృష్టికి తీసుకువచ్చింది. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.37 వేల చెక్కును అందించినట్లు చెప్పారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశ భవిష్యత్తు

డీఎస్పీ సైదా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సైదా

జహీరాబాద్: దేశ భవిష్యత్తు గ్రామాల అభివృద్ధితోనే ముడిపడి ఉందని, యువతీ యువకులు ఉద్యోగాలు చేస్తూ జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని డీఎస్పీ సైదా అన్నారు. శనివారం జహీరాబాద్‌లో ఎంఎస్‌ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ యూత్ లీడర్ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత స్వచ్ఛంద సంస్థల ద్వారా శిక్షణ పొంది, అదే సంస్థ ద్వారా ఉపాధి పొందడం గొప్ప విషయమన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు చేస్తూ సామాజిక బాధ్యతతో గ్రామాల్లో సేవ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని 50 గ్రామాలకు చెందిన కమ్యూనిటీ యూత్ లీడర్లు, నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అస్మా పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయండి


కంప్యూటర్లను ప్రారంభిస్తున్న సంగ్రాం

నారాయణఖేడ్: పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు పాటుపడాలని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ సూచించారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు కంప్యూటర్లను బహుకరించారు. కార్యక్రమంలో సంగ్రాం మహరాజ్ పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా శిశుమందిర్‌లో చదివిన ఎందరో ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు చే స్తూ సమాజంలో గుర్తింపు పొందారని గుర్తు చేశారు.

తహసీల్ గ్రౌండ్‌లో టపాసుల దుకాణాలు

నారాయణఖేడ్: దీపావళి పండుగను పురస్కరించుకుని ఖేడ్ పట్టణానికి సంబంధించి టపాసుల దుకాణాలన్నీ స్థానిక గ్రౌండ్‌లో ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండురోజుల కిందటే దుకాణాదారులతో సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ మేరకు శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గ్రౌండ్‌లో దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా చెత్త, చెదారం లేకుండా ఊడ్చి శుభ్రత పనులు చేశారు.


గ్రౌండ్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు

అక్రమ నిర్మాణాలపై కొరడా


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ కిషన్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్ మూడు బృందాలుగా ఏర్పడి పోలీస్ అధికారులతో సంయుక్తంగా అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్మాణాల కోసం తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణాధికారులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై తోపుడు బండ్లు పెట్టొద్దు


దుకాణదారుడికి సూచనలిస్తున్న ఎస్‌ఐ

నారాయణఖేడ్: దుకాణాల ఎదుట రోడ్లపై తోపుడు బండ్లను ఉంచొద్దని ఖేడ్ ఎస్‌ఐ రావుల శ్రీశైలం దుకాణాదారులకు సూచించారు. పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉండటం వల్ల దుకాణదారులు సామగ్రి, తోపుడు బండ్లను రోడ్లపై ఉంచడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో శనివారం ఎస్‌ఐ శ్రీశైలం సిబ్బందితో కలిసి రోడ్డుకు ఇరువైపులు ఉన్న దుకాణాలను సందర్శించారు. రోడ్లపై సామగ్రిని ఉంచరాదని, దుకాణాలకు వచ్చే వాహనదారులు రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలని సూచించారు. తోపుడు బండ్లను వెనకకు పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ చొరవ వల్ల వాహనదారులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

అస్తవ్యస్తంగా పార్కులు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పార్క్‌లు అధ్వానంగా తయారవుతున్నాయి. కలెక్టరేట్ పక్కన వున్న పార్క్ మందుబాబులకు అడ్డాగా మారుతుంది. ఉదయం, సాయంత్రం కలెక్టరేట్ పక్కనున్న పార్కులో కొద్దిసేపు సేద తీరుద్దామనుకొని వచ్చే వాళ్ళకి ఇక్కడ పరిస్థితులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. పార్కులో ఎక్కడ చూసినా చెత్త, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు పడి ఉండడంతో పాటు బీరు బాటిళ్లు సైతం దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమా లేదా మాకు అడ్డు చెప్పేది ఎవరు అని మందుబాబుల ధైర్యమో తెలవడం లేదు. కానీ ఇటీవల పార్కులో మందుబాబులు ఆగడాలు ఎక్కువైపోతున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా పార్కులో ఎక్కడ చూసినా మందు బాటిళ్లు దర్శనమిస్తున్నట్లు పార్కుకు వచ్చే వారు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.


పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం

బిల్డర్‌ను బెదిరించిన మాజీ చైర్మన్

మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌గౌడ్ ఆరోపణ


మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి ఓ బిల్డర్‌ను బెదిరించాడని పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్ గౌడ్ ఆరోపించారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. పాండు రంగారెడ్డి అమీన్‌పూర్‌లో అరాచకాలు చేస్తున్నారని అన్నారు. బిల్డర్లను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. చిన్నచిన్న లోపాలు చూపెడుతూ.. ఇళ్లు కట్టే వారి నుంచి అక్రమంగా వసూలు చేయడం తగదని శ్రీకాంత్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ బొల్లారం పరిధిలో హైడ్రా ఇతర కారణాల చేత పౌరులు భయం భయంగా జీవిస్తున్నారని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉండటం వల్ల రెండు పట్టణాల్లో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని వాటికి మాజీ మున్సిపల్ చైర్మన్ అధికారుల అండ ఉందని ఆరోపించారు. బాధిత బిల్డర్ ముఖేశ్ మాట్లాడుతూ మాజీ ప్రజా ప్రతినిధి తనను డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు.